జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 21 | ఆగస్టు | 2026 • పేజీలు : 7



# గిన్నిస్ బుక్‌లో రాహుల్ విజ్ఞాన్ విద్యార్థిని లేక్ష్యశ్రీ

**చర్ల, ఆగస్టు 20:(ప్రజా జ్యోతి):** కరాటే విభాగంలో ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన రాహుల్ విజ్ఞాన్ పాఠశాల ఆరవ తరగతి విద్యార్థిని నంబూరి లేక్ష్యశ్రీని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. హైదరాబాద్ గచ్చిబౌలిలో ఏప్రిల్ 26న ప్రపంచ స్థాయిలో నిర్వహించిన కరాటే కార్యక్రమంలో లేక్ష్యశ్రీ విశేష ప్రతిభ కనబరిచి ఈ అరుదైన ఘనత సాధించింది. ఆమెకు కరాటేలో నిరంతరం శిక్షణ




అందించిన మాస్టర్ యు. ముత్తును కూడా పాఠశాల యాజమాన్యం అభినందించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వర్మ రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లేక్ష్యశ్రీని, ఆమె తల్లిదండ్రులను, కరాటే మాస్టర్ యు. ముత్తు దంపతులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో...




# 'శక్తి' సెగ..
## పాలిటెక్నిక్‌కు కొత్త చిక్కు!

- జీవో 97తో సాంకేతిక విద్యలో మార్పులు.. విద్యార్థుల్లో ఆందోళన
- పీపీపీ విధానంతో ప్రైవేట్ భాగస్వామ్య ప్రభావంపై భయం
- ఐటీఐలు, ఏటీసీల తర్వాత పాలిటెక్నిక్‌లపైనా నైపుణ్య మోడల్
- ఈసెట్ – బీటెక్ మార్గంపై సందేహాలు.. భవిష్యత్తుపై భరోసాకు డిమాండ్
- ఉద్యోగ నైపుణ్యాలే లక్ష్యమంటున్న ప్రభుత్వం.. ఉన్నత విద్యకు దారేది అంటున్న విద్యార్థులు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్ట్ 20, ప్రజాజ్యోతి:** తెలంగాణలో సాంకేతిక, నైపుణ్య విద్యా వ్యవస్థలో ప్రతిపాదిత మార్పులు విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తున్నాయి. ఇందుకుగాను గత వారం రోజులుగా భద్రాద్రి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జీవో నంబర్ 97తో పాలిటెక్నిక్ విద్యను ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థ నుంచి నైపుణ్య ఆధారిత వ్యవస్థతో అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండటమే ఈ వివాదానికి కారణమైంది. ఇప్పటివరకు పాలిటెక్నిక్ డిప్లొమా ద్వారా ఉద్యోగంతో పాటు బీటెక్ ఉన్నత విద్యకు వెళ్లే అవకాశం ఉండగా.. కొత్త విధానంలో ఆ మార్గం భవిష్యత్తులో ఎలా ఉంటుందన్నదే విద్యార్థుల ప్రధాన ప్రశ్నగా మారింది. మరోవైపు పరిశ్రమల భాగస్వామ్యం, పీపీపీ విధానం నేపథ్యంలో ప్రభుత్వ విద్యలో ప్రైవేట్ సంస్థల ప్రభావం పెరుగుతుందన్న ఆందోళన కూడా

మిగతా 2 లో...

# కార్పొరేషన్ ఆఫీసే కనిపించడంలేదట..!




- కార్యాలయం గుర్తు పట్టలేకపోతున్నారంటూ ప్రజావాణిలో ఫిర్యాదు
- ప్రహరీ గోడ ఎత్తు పెంచి.. రంగులతో తీర్చిదిద్దాలని వినతి
- పరిశుభ్రత, ప్రభుత్వ పథకాల చిత్రాలతో ఆకర్షణీయంగా మార్చాలని సూచన
- కోతులు, కుక్కలు, పందుల బెడదపైనా ఫిర్యాదు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి , ఆగస్టు 20 (ప్రజాజ్యోతి) :** కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం ఉందట.. కానీ ఎక్కడుందో మాత్రం ప్రజలకు కనిపించడం లేదట. తమ పనుల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు కార్యాలయాన్ని గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారట. ఇదేదో కొత్త సమస్య అనుకుంటే పొరపాటే.. ఇదే విషయంపై ప్రజావాణిలో ఓ వినతిపత్రం రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీంతో కార్యాలయం కనిపించకపోతే ప్రజలు ఎలా వెతుక్కోవాలన్నదే అసలు ప్రశ్నగా మారగా.. చివరకు కార్యాలయానికే ఓ ప్రత్యేక గుర్తింపు

మిగతా 2 లో...

# ఏజెన్సీలో అక్రమ నిర్మాణాల జోరు!

- వినాయకపురంలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ భవనం?



**అశ్వరావుపేట ఆగస్టు 20 ప్రజా జ్యోతి** అశ్వరావుపేట అశ్వరావుపేట మండలం అయిన వినాయకపురంలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం అనుమతులు ఉన్నాయా? అధికారుల తనిఖీలు ఎక్కడ? వినాయకపురం: ఏజెన్సీ ప్రాంతమైన వినాయకపురంలో కమర్షియల్ భవనం నిర్మాణం జరుగుతున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణానికి అవసరమైన భవన అనుమతులు, సాంక్షన్ ప్లాన్,

మిగతా 2 లో...





# దమ్మపేటలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

- వైద్యం.. విద్య.. సోలార్ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన
- నిర్లక్ష్యంపై ఆగ్రహం.. ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

**దమ్మపేట, ఆగస్టు 20(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలో ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గండుగులపల్లి మోడల్ సోలార్ గ్రామం, మందలపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను సందర్శించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### ఏడాదిగా పనిచేయని వైద్య పరికరంపై ఆగ్రహం

పట్వారిగూడెం పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ అంకిత్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు,

మిగతా 2 లో...

# ‘శక్తి’ సెగ.. పాలిటెక్నిక్‌కు కొత్త చిక్కు!

(మొదటి పేజీ తరువాయి...)

వ్యక్తమవుతోంది. దీంతో ఈ విధానంపై స్పష్టత ఇవ్వాలని, లేకుంటే రద్దు చేయాలని విద్యార్థులు, విధ్యార్థి సంఘాలు కలెక్టరేట్‌లను సైతం ముట్టడిస్తున్నారు.

### ›› అసలు వివాదం.. గతంలో విధానం..?

ఇప్పటివరకు రాష్ట్రంలో పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు సంబంధించిన సిలబస్, పరీక్షలు, ఫలితాలు, సర్టిఫికెట్ల వంటి అకడమిక్ వ్యవహారాలు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఈ విద్యను నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ వ్యవస్థతో అనుసంధానం చేసే ప్రతిపాదన రావడంతో అసలు వివాదం మొదలైంది. గతంలో పదో తరగతి తర్వాత మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రధానంగా రెండు మార్గాలు ఉండేవి. ఒకటి డిప్లొమా అర్హతతో ఉద్యోగంలోకి వెళ్లడం. రెండోది ఈసెట్ ద్వారా బీటెక్‌లో రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశించడం. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు రెండో మార్గం తక్కువ ఖర్చుతో ఇంజినీరింగ్ విద్యను కొనసాగించే అవకాశంగా ఉంది. అంటే పాలిటెక్నిక్ కేవలం ఉద్యోగ శిక్షణకు మాత్రమే పరిమితం కాకుండా ఉన్నత విద్యకు వెళ్లే మెట్టుగా కూడా కొనసాగింది. ఇప్పుడు ఈ వ్యవస్థలో మార్పు వస్తుందన్న నేపథ్యంలోనే విద్యార్థులు తమ భవిష్యత్తుపై ప్రశ్నలు వేస్తున్నారు.

### ›› జీవో నెం.97.. ‘శక్తి’ ఏంటి?

నైపుణ్యాభివృద్ధి, శిక్షణ వ్యవస్థను మరింత సమీకృతంగా నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ‘శక్తి’ (స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్) వ్యవస్థ కింద నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం మరింత పెరగనుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు రూపొందించడం, యువతకు ఉద్యోగ ఆధారిత శిక్షణ అందించడం దీని ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక కోర్సులు, ఏటీసీల ఏర్పాటు, ఇండస్ట్రీ 4.0 తరహా శిక్షణ వైపు మార్పులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ విద్యను కూడా ఇదే విస్తృత నైపుణ్య వ్యవస్థతో అనుసంధానం చేసేలా జీవో నంబర్ 97 ద్వారా ‘శక్తి’ని ముందుకు తీసుకురావడం విద్యార్థుల్లో అనుమానాలకు కారణమవుతోంది. ముఖ్యంగా కొత్త నైపుణ్య వ్యవస్థలో పరిశ్రమల భాగస్వామ్యం, పీపీపీ విధానానికి ఉన్న ప్రాధాన్యం నేపథ్యంలో ప్రభుత్వ విద్యలో ప్రైవేట్ సంస్థల పాత్ర భవిష్యత్తులో ఎంతవరకు ఉంటుందన్నదే వారి ప్రధాన ఆందోళనగా మారింది. ఇప్పటికే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి వ్యవస్థల్లో పీపీపీ (ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య విధానం) ద్వారా ప్రభుత్వం, ప్రైవేట్ పరిశ్రమలు కలిసి నైపుణ్య శిక్షణ, సాంకేతిక వసతులు, కోర్సులు, ఉద్యోగ అనుసంధానం వంటి అంశాల్లో పనిచేస్తున్నాయి. ఇదే తరహా ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యం పాలిటెక్నిక్ విద్యలోనూ ఎంతవరకు ఉంటుందన్నదే ఇప్పుడు విద్యార్థుల ప్రశ్న. కోర్సుల రూపకల్పన నుంచి శిక్షణ, ప్రయోగశాలలు, నిర్వహణ వరకు ప్రైవేట్ సంస్థల పాత్ర పెరుగుతుందా? ప్రైవేట్ భాగస్వామ్యం కేవలం సాంకేతిక అభివృద్ధి, శిక్షణకే పరిమితమవుతుందా? లేక భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రభావం పెరుగుతుందా? అన్నదే వారి సందేహంగా మారింది.

### ›› ఈసెట్, లేటరల్ ఎంట్రీపై భరోసాకై

పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలో అత్యంత కీలకమైన అంశం ఈసెట్, బీటెక్ లేటరల్ ఎంట్రీ. జీవో 97, శక్తి వ్యవస్థతో ఈసెట్ పూర్తిగా రద్దవుతుందని, బీటెక్ లేటరల్ ఎంట్రీ నిలిచిపోతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త వ్యవస్థలో తమ ఉన్నత విద్యా మార్గం యథావిధిగా కొనసాగుతుందా? అన్నదానిపై ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో ఈ మార్పులతో పాలిటెక్నిక్ విద్య స్వరూపం ఎలా ఉండబోతుంది? ప్రభుత్వ సాంకేతిక విద్యపై నియంత్రణ కొనసాగుతుందా? అధ్యాపకులు, సిబ్బంది భవిష్యత్తు ఏమవుతుంది? పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థల పాత్ర ఎంతవరకు ఉంటుంది? వంటి ప్రశ్నలకు కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

## కొత్త విధానంపై స్పష్టత..

వాస్తవానికి నైపుణ్య విద్యను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడం, ఉద్యోగ అవకాశాలు పెంచడం వంటి లక్ష్యాలు అమలైతే కొత్త విధానం ద్వారా ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. మార్పును పూర్తిగా వ్యతిరేకించడం తమ ఉద్దేశం కాదని.. కానీ ఆ మార్పు పేరుతో డిప్లొమా తర్వాత ఉన్నత విద్యకు ఉన్న మార్గాలు బలహీనపడకూడదన్నదే తమ ప్రధాన డిమాండ్ అని విద్యార్థులు చెబుతున్నారు. అందుకే నైపుణ్య శిక్షణతో పాటు ఈసెట్, బీటెక్ లేటరల్ ఎంట్రీ అవకాశాలను కొనసాగిస్తూ, అధ్యాపకులు – సిబ్బంది భవిష్యత్తుకు భరోసా కల్పించి, ప్రైవేట్ సంస్థల పాత్రకు స్పష్టమైన పరిమితులు ఉండేలా చూడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జీవో 97తో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పుల ఉద్దేశం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, ఈ విధానం ఎలా అమలవుతుంది, విద్యార్థులు – అధ్యాపకులు వ్యక్తం చేస్తున్న సందేహాలకు సమాధానాలు ఏమిటన్న దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. నైపుణ్యం కోసం మార్పు అవసరమే.. కానీ ఆ మార్పు విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలకు భరోసాగా మారాలి తప్ప.. కొత్త అనుమానాలకు కారణం కాకూడదు. ప్రభుత్వం ఈ అంశాలపై స్పష్టమైన సమాధానాలు ఇస్తేనే జీవో 97పై కొనసాగుతున్న వివాదానికి తెరపడే అవకాశం ఉంది.

## కార్పొరేషన్ ఆఫీసే కనిపించడంలేదట..!

(మొదటి పేజీ తరువాయి...)

కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నట్లుగా ఈ ఫిర్యాదు ఉంది. వివరాల్లోకెళ్తే .. మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు బుధవారం నాడు కార్పొరేషన్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన ప్రజావాణిలో కమిషనర్, మేయర్‌కు ఓ వినూత్న ఫిర్యాదుతో వినతిపత్రం అందించారు. అందులో కార్యాలయ ప్రహరీ గోడను ఎత్తుగా నిర్మించి, దానిపై పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యాలయం బయట నుంచే ప్రజలకు స్పష్టంగా కనిపించేలా అవసరమైన సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని సుదూర ప్రాంతాల నుంచి తమ పనుల కోసం వచ్చే ప్రజలకు కార్యాలయం గుర్తుపట్టడం కష్టంగా మారిందని మునిగడప అందులో తెలిపారు. అయితే ఈ ఫిర్యాదుతో ఏకీభవిస్తున్న వాళ్ళు.. ప్రజలకు దారి చూపాల్సిన కార్యాలయానికే ముందుగా గుర్తింపు కల్పించాల్సిన పరిస్థితి వచ్చిందన్న విమర్శలను కురిపిస్తున్నారు. కనీసం కార్యాలయం ఎక్కడుందో తెలిసేలా ఏర్పాటు చేస్తే ప్రజల వెతుకులాటకు తెరపడుతుందని పేర్కొంటున్నారు . దీంతోపాటు ఇక కార్యాలయం కనిపించడం ఒక సమస్య అయితే.. కార్పొరేషన్ పరిధిలో కోతులు, కుక్కలు, పందుల బెడద మరో సమస్యగా మారిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కోతులు, కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని, పందుల సంచారాన్ని అరికట్టి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తానికి కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఇప్పుడు విచిత్రమైన ఫిర్యాదు ఒకటి తెరపైకి వచ్చింది. ప్రజల సమస్యలు వినాల్సిన కార్పొరేషన్ కార్యాలయమే ప్రజలకు కనిపించడం లేదన్న ఫిర్యాదు రావడం ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో కార్యాలయానికి గుర్తింపు కల్పించడంతో పాటు, ప్రజలను వేధిస్తున్న జంతువులు, పారిశుధ్య సమస్యలపైనా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## గిన్నిస్ బుక్‌లో రాహుల్ విజ్ఞాన్ విద్యార్థిని లేక్ష్యశ్రీ





(మొదటి పేజీ తరువాయి...)

ఎంఈఓ పరిటాల వెంకటరమణ మాట్లాడుతూ లేక్ష్యశ్రీ సాధించిన ఘనత పాఠశాలకే కాకుండా ప్రాంతానికి గర్వకారణమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లోనూ రాణించాలని సూచించారు. లేక్ష్యశ్రీ తల్లిదండ్రులతో పాటు కరాటే మాస్టర్ ముత్తుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్. కుమార్, డాక్టర్ ప్రతిభ, ఎడ్యుకేషనల్ డైరెక్టర్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.ఎల్. నరసింహారావు, కొసరాజు హరిచరణ్, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.కె. ఉస్మాన్, క్రాంతికుమార్, ఆనంద్, సునీత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బడికి వెళ్లాలంటే.. వాగు దాటాల్సిందే!





**చర్ల, ఆగస్టు 20:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సర్గుజా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లఖన్‌పూర్ గ్రామ సమీపంలోని వాగుపై వంతెన లేకపోవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ప్రాణాలను పణంగా పెట్టి వాగు దాటాల్సిన దుస్థితి నెలకొంది. తుంగరి గ్రామంలోని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వర్షాకాలం వచ్చిందంటే కష్టాలు తప్పడం లేదు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో తల్లిదండ్రులే పిల్లలను వాగు దాటించి పాఠశాలకు పంపిస్తున్నారు. వాగు ఉధృతి పెరిగినప్పుడు విద్యార్థులతో పాటు రైతులు, కూలీలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .వాగు దాటే సమయంలో అకస్మాత్తుగా నీటి ఉధృతి పెరిగితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాగుపై వెంటనే వంతెన నిర్మించాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఏజెన్సీలో అక్రమ నిర్మాణాల జోరు!

(మొదటి పేజీ తరువాయి...)

సెట్ బ్యాక్, పార్కింగ్, ఫైర్ సేఫ్టీ తదితర నిబంధనలు పాటిస్తున్నారా? అన్నది స్థానికుల్లో ప్రశ్నగా మారింది. కమర్షియల్ భవనాలకు సాధారణ నిర్మాణాల కంటే అదనపు అనుమతులు, నిబంధనలు వర్తించే అవకాశం ఉంది. తెలంగాణలో నాన్-రెసిడెన్షియల్ భవనాల అనుమతులకు TG-bPASS సింగిల్-విండో విధానం ఉంది. అధికారుల మౌనం ఎందుకు? నిర్మాణం జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించారా? అనుమతి పత్రాలు, ఆమోదించిన భవన ప్లాన్‌ను పరిశీలించారా? నిర్మాణం మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనధికార నిర్మాణాలు లేదా ఆమోదించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలపై జిల్లా స్థాయిలో తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలకు ప్రత్యేక వ్యవస్థ ఉన్నట్లు TG-bPASS అధికారిక సమాచారం చెబుతోంది. బాక్స్: అధికారులకు కీలక ప్రశ్నలు ఈ కమర్షియల్ భవనానికి భవన నిర్మాణ అనుమతి ఉందా? అనుమతి ఉంటే దాని ప్రొసీడింగ్స్ నంబర్ ఏమిటి? ఆమోదించిన సాంక్షన్ ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతోందా? సెట్ బ్యాక్, పార్కింగ్ నిబంధనలు పాటిస్తున్నారా? అవసరమైన ఫైర్ సేఫ్టీ / ఇతర NOCలు ఉన్నాయా? నిర్మాణ స్థలాన్ని అధికారులు ఎప్పుడు తనిఖీ చేశారు? అనుమతి లేకుంటే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? ప్రజల డిమాండ్ వినాయకపురంలో జరుగుతున్న కమర్షియల్ నిర్మాణంపై అధికారులు స్థల పరిశీలన చేసి, అనుమతులు మరియు సాంక్షన్ ప్లాన్‌ను బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ సెక్రెటరీ వివరణ నోటీసు అయితే ఇచ్చా ఉన్నాము వాళ్ల దగ్గర ఉన్న ఏదైతే ఆధారాలు ఉన్నాయి వాటిని పట్టుకొని రమ్మని చెప్పి ఉన్నాము వాటిని పరిశీలించిన తర్వాత మిగతా వివరాలు తెలియజేస్తామని చెప్పినారు

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా







- **యువతను విస్మరించిన_ నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేవు**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 20 ,(ప్రజా జ్యోతి)** యువతను విస్మరించిన ఏ పాలకు ప్రభుత్వం కూడా మనుగడ సాగించలేదని యువతను విస్మరిస్తే పతనం తప్పుదని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతను తమ రాజకీయ పదవుల కోసం పావుగా వాడుకుంటున్నారని, ఎన్నికలకు ముందు కల్లబొల్లి హామీలు ఇచ్చి గద్దెనెక్కుతూ హామీలు అమలు చేయకుండా యువతను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇస్తే మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి రెండు ప్రభుత్వాలు కూడా అమలు చేయక నిరుద్యోగ యువతను మోసం చేశాయని ఆరోపించారు. మోడీ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల చదువుకు చదువుకున్న తర్వాత ఉద్యోగానికి భరోసా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల పేపర్లు లీక్, నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గం వంటి అంశాలను పట్టించుకోకుండా ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సల్స్ అని దిమాగి నక్సల్స్ అని సంబోధిస్తూ అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు యువత ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోకపోతే ఆ యువతే గద్ద దింపుతారని విషయాన్ని మర్చిపోకూడదని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి ఆకాంక్షలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం యూత్ డిక్లరేషన్ ప్రకటించిందని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రతి నెల ఉద్యోగ నోటిఫికేషన్ కావస్తున్న గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగాలు భర్తీ చేశారే తప్ప కొత్తగా ఉద్యోగ కల్పన చేయలేదని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పాలక ప్రభుత్వాలు నిరుద్యోగలను తమ ఓటు బ్యాంకు గాని ఉపయోగించుకుంటున్నారు తప్ప నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గాలు చూపట్లేదని ఆరోపించారు. ప్రభుత్వాల మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ కె బ్రహ్మచారి ,కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు చిరంజీవి నాయుడు, భూక్య రమేష్, కోబల్, నాయకులు కాళంగి హరికృష్ణ,తులసీరాం, బత్తుల వెంకటేశ్వర్లు, చంటి, సందకూరి, లక్ష్మి, ఇందిరా,అభిమిత్ర, అబిద ,బాల కృష్ణ, రఘు ,రామకోటమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల్లో మొక్కలు నాటితే ఊరుకోం



**చర్ల, ఆగస్టు 20:(ప్రజాజ్యోతి):** తరతరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో కందకాలు తవ్వి మొక్కలు నాటేందుకు అటవీ అధికారులు ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ ముసలి సతీష్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం చర్ల అటవీ శాఖ రేంజర్ రజితకు న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ముసలి సతీష్ మాట్లాడుతూ చర్ల మండలం పోరాటాల గడ్డగా, విప్లవాలకు అడ్డాగా పేరొందిందన్నారు. చిన్నమిడిసీలేరు, కొయ్యూరు, రేగుంట, మామిడి గూడెం ప్రాంతాల్లో గిరిజన ఆదివాసీలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో కందకాలు తవ్వి మొక్కలు నాటే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించేలా రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్, పేసా చట్టం, 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి చట్టాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో గిరిజనుల హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని ఆరోపించారు.

పోడు భూముల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న పంటలను ధ్వంసం చేసి, చుట్టూ కందకాలు తవ్వి మొక్కలు నాటడం వల్ల వారి జీవనాధారం దెబ్బతింటోందని అన్నారు. అటవీ అధికారుల తీరుపై ఆదివాసీ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని గిరిజనుల చట్టబద్ధ హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని, అటవీ శాఖ అధికారులను కోరారు. సమస్యను పరిష్కరించకపోతే ఆదివాసీ ప్రజలను ఐక్యం చేసి, ఆదివాసీ సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులను కలుపుకుని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ చర్ల మండల నాయకులు సంతపూరి సురేష్, గొంది ముయన్న, దుమ్ముగూడెం మండల నాయకుడు కుంజ జోగారావు, మడకం సమ్మక్క, ఇర్ప ప్రసాద్, తెల్లం పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**ఇల్లందు, ఆగస్టు 20 (ప్రజా జ్యోతి):** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను గురువారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జగదాంబ సెంటర్ లో రాజీవ్ గాంధీ ద్రోహానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ లు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఆధునిక సాంకేతికతకు, సమాచార రంగ అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు దేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించేందుకు ఆయన తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమైనవన్నారు.

**♦ యువతకు స్ఫూర్తిదాయకం**

రాజీవ్ గాంధీ యువతకు ఎన్నో అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారని నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్య, సాంకేతిక రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పెండేల రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, కౌన్సిలర్లు కొర్లపాటి శివ కిరణ్, చిల్లా విజయ భారతి, మెరుగు కార్తీక్, గోపగాని రాజు, నాయకులు మున్న, జీవి భద్రం, ఐజాక్, గందె సదానందం, ఉల్లింగ సతీష్, కమల్ కుమార్ కోరి, వత్స వెంకన్న, పర్రె శ్రీనివాస్, కుమార్, మిట్టపల్లి నగేష్, గాలిపల్లి స్వరూప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**చర్ల, ఆగస్టు 20:(ప్రజా జ్యోతి):** భారత మాజీ ప్రధాని, భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను చర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దూరదృష్టిగల నాయకుడని భారతదేశాన్ని 21వ శతాబ్దపు అవకాశాలకు సిద్ధం చేసేందుకు అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని అన్నారు. యువతపై ఆయనకు ఉన్న విశ్వాసం, సాంకేతిక పురోగతిపై ఆయన చూపిన దూరదృష్టి కొత్త ఆలోచనలను ప్రోత్సహించిన తీరు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు.సామరస్యం, సమైక్యత స్ఫూర్తిని మరింత బలోపేతం చేయడం యువత ఆకాంక్షలను ప్రోత్సహించడం ద్వారా రాజీవ్ గాంధీకి మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల పీఏసిఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, చర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, సీనియర్ నాయకులు జవ్వాది రవి, ఎర్రెంకి ఉదయ ప్రభాకర్ రావు (బాబ్జి), మేడిచర్ల కుమార్, అలవాల మహేష్ నాయుడు (బాలు), సుందరి సురేష్, పటేల్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఎలకం నరేంద్ర, తోటమల్ల వరప్రసాద్, ఒళ్ళే శ్రీకాంత్, కాకర్ల కుమార్, వార్డు సభ్యురాలు కుక్కడపు రాజేశ్వరి, పాశిగంటి శ్రీదేవి, హబీబ్ ఖాన్, ఎస్సీ సెల్ నాయకులు చెన్నం రామ్మూర్తి, గొబ్బూరి పూర్ణచందర్ రాజు, కణితి శ్రీనివాసరావు, పూనెం రాంబాబు, శ్యామల తరుణ్, లాయర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్ యు ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన

- **కార్యాలయ గోడలపై నిరసనలు రాసేందుకు యత్నించిన పి డి ఎస్ యు కార్యకర్తలు, అడ్డుకున్న పోలీసులు**

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 20,(ప్రజా జ్యోతి)** పాలిటెక్నిక్ విద్యను కాపాడాలంటూ పిడిఎస్యు విద్యార్థి సంఘ నాయకులు గురువారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా పి డి ఎస్ యు కార్యకర్తలు కలెక్టరేట్ కార్యాలయ గోడలపై నినాదాలు రాసేందుకు విద్యార్థులు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు, దీంతో కాసేపు కార్యాలయం ఎదుట ఉద్రిక్త వాతావరణం నెలకొంది, పలువురు విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు ,పిడిఎస్సి నాయకులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులపై అవమానుషంగా ప్రవర్తించిన మహబూబాద్ సిఐ రఘుపతి రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వ నిర్ణయాలు వెంటనే ఉపసంహరించుకోవాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పిడిఎస్ యు నాయకులు పాల్గొన్నారు

# రక్త పరీక్షల నిర్వహణ



**ఇల్లందు,ఆగస్టు 21 (ప్రజా జ్యోతి)** ఇల్లందు ఐసిటిఎస్ కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని 23వ వార్డు 24 ఏరియాలో గురువారం పలువురికి రక్త పరీక్షలను నిర్వహించారు. ఇటీవల చాప కింద నీరుల విస్తరిస్తున్న హెపటైటిస్ బి, హెచ్ఐవి వంటి వాటిని గుర్తించేందుకు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి ప్రధాన కూడల్లో ఉన్న ప్రజల రక్త నమూనాలను సేకరించి అక్కడికక్కడే వారి యొక్క పరీక్షల ఫలితాలను తెలియజేయడం జరుగుతుందని నిర్వాహకులు ఓఆర్ డబ్ల్యులు రెహమత్, ఎస్టర్ రాణి తెలిపారు. ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వర్లు సూచనలు మేరకు రోజు ఒక్కో సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రోజు రోజుకి చాప కింద నీరుల విస్తరిస్తున్న హెచ్ఐవి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో శృంగారంలో పాల్గొనే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

## 1999–2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవా స్ఫూర్తి

- పాఠశాలకు రూ.15 వేల విలువైన బీరువా బహూకరణ





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 20 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల బ్యాచ్ సభ్యులు పాఠశాలకు రూ.15 వేల విలువైన బీరువాను బహూకరించారు. మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుల సమక్షంలో బీరువాను పాఠశాలకు అందజేశారు. ముందుగా ఎంఈఓ ఆనంద్ కుమార్, హెచ్ఎం ఏ. వెంకటేశ్వరరావులను పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాల అవసరాల కోసం బీరువాను అందజేశారు. పూర్వ విద్యార్థులు అందించిన సహకారాన్ని ఎంఈఓ, హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుజ్జి కృష్ణ, బాలకృష్ణ, మధుసూదన్ రావు, పుల్లారావు, సైదులు, పంచదార వెంకటేశ్వర్లు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## కరకట్టతోనే వరద ముప్పునకు చెక్!

- గ్రామసభలో ప్రజాభిప్రాయ సేకరణ..
- శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్




**బూర్గంపహాడ్, ఆగస్టు20 (ప్రజా జ్యోతి):** గోదావరి వరదల నుంచి మండల కేంద్రాన్ని కాపాడేందుకు ప్రతిపాదించిన కరకట్ట నిర్మాణంపై అధికారులు ప్రజాభిప్రాయాలను సేకరించారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డులో గ్రామసభ నిర్వహించి నిర్మాణానికి సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించారు. కరకట్ట నిర్మాణంతో వరద నీటి ప్రభావాన్ని తగ్గించి గ్రామాన్ని ముంపు నుంచి రక్షించవచ్చని అధికారులు తెలిపారు.గోదావరి వరదలు వచ్చిన ప్రతిసారీ బూర్గంపాడు మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వరదల కారణంగా పంట పొలాలు, ఇళ్లు, రహదారులు దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. వరదల సమయంలో తాత్కాలిక చర్యలు చేపట్టడం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.కరకట్ట నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి గ్రామానికి శాశ్వత రక్షణ కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గ్రామసభలో ప్రజలు తెలిపిన సూచనలు, అభిప్రాయాలను అధికారులు నమోదు చేసుకున్నారు. వాటిని పరిగణనలోకి తీసుకుని కరకట్ట నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, సర్పంచ్ మంద మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, పంచాయతీ సెక్రటరీ సంపత్ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వణికిస్తున్న వానరాలు

- జనం బెంబేలు..
- జనవాసాల్లో గుంపులు గుంపులుగా సంచారం
- ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్న ప్రజలు
- ఇండ్లలోకి చొరబడి నానా బీభత్సం..
- తలుపులు పెట్టినా రక్షణ కరువు
- భయంతో బిక్కుబిక్కుమంటున్న జనం..
- శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు





**ఇల్లందు, ఆగస్ట్ 20 (ప్రజా జ్యోతి)** జనవాస ప్రాంతాల్లో వానరాల సంచారం ప్రజలను వణికిస్తుంది. పట్టణంలోని పలు కాలనీలు, వీధుల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇంటి పరిసరాల్లోకి వచ్చి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, వస్తువులను చిందరవందర చేయడం, ఇళ్లపైకి ఎక్కి హడావుడి సృష్టించడం వంటి ఘటనలతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ♦ ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయం

వానరాల గుంపులు ఎప్పుడు ఎక్కడి నుంచి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో పలువురు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు కోతుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నారని వాపోతున్నారు. వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులను చూసి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ♦ ఇంట్లోకి చొరబడి బీభత్సం

ఇళ్ల తలుపులు, కిటికీలు తెరిచి ఉన్న సమయంలో కోతులు లోపలికి చొరబడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంటగదిలోని ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు ఇంట్లోని వస్తువులను కిందపడేసి చిందరవందర చేస్తున్నాయని చెబుతున్నారు. కొన్నిసార్లు వాటిని బయటకు పంపేందుకు ప్రయత్నిస్తే ఎదురు తిరుగుతున్నాయని, దీంతో ప్రజలు మరింత భయపడుతున్నారని పేర్కొంటున్నారు.

### ♦ తలుపులు పెట్టినా రక్షణ కరువు

కోతుల బెడద నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు ఇళ్ల తలుపులు, కిటికీలు మూసుకుంటున్నా పూర్తిస్థాయిలో రక్షణ లభించడం లేదని అంటున్నారు. ఇంటి పైకప్పులు, గోడలు, విద్యుత్ స్తంభాలపైకి ఎక్కుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తిరుగుతున్న వానరాల గుంపులతో స్థానికులు అప్రమత్తంగా ఉండాల్సి వస్తుంది. అయినప్పటికీ ఏదో ఒక సందర్భంలో జనం పైకి ఎగబడడం చేయడం జరుగుతుంది.

### ♦ చిన్నారులు, వృద్ధులపై ఆందోళన

వీధుల్లో ఆడుకునే చిన్నారులు, ఒంటరిగా బయటకు వచ్చే వృద్ధులు కోతుల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ సమస్య కూడా తీవ్రమవుతుందని, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. అంతేకాకుండా వీధుల్లో చెత్త పేరుకుపోవడం, ఆహార వ్యర్థాలు బహిరంగంగా పడేయడం వల్ల కోతులు జనవాసాల వైపు ఆకర్షితమవుతున్నాయని స్థానికులు భావిస్తున్నారు. చెత్తను క్రమం తప్పకుండా తొలగించడంతో పాటు ప్రజలు కూడా ఆహార వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

### ♦ శాశ్వత పరిష్కారం చూపరూ

కోతుల బెడదపై తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, వానరాలను సురక్షితంగా నియంత్రించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు, వానరాలకు ఎలాంటి హాని కలగకుండా నిపుణుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ♦ అధికారులు స్పందించాలని వేడుకోలు

రోజురోజుకూ సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో మున్సిపల్, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. జనవాస ప్రాంతాల్లో కోతుల గుంపుల సంచారాన్ని నియంత్రించి ప్రజలకు భద్రత కల్పించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను వేడుకుంటున్నారు.

# పంట నష్టంపై రంగంలోకి వ్యవసాయ శాఖ

- రైతుల పొలాన్ని పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారి అనూష





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 20 (ప్రజా జ్యోతి):** మందులు పిచికారీ చేసిన అనంతరం వరి పంట దెబ్బతిన్న ఘటనపై ప్రజా జ్యోతి ప్రచురించిన కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. వ్యవసాయ శాఖ అధికారి అనూష గురువారం అబ్బుగూడెం గ్రామంలోని కౌలు రైతులు శ్రీను, కోటేశ్వరరావు సాగు చేస్తున్న వరి పొలాన్ని గ్రోమోర్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటకు మందులు ఎప్పుడు, ఏ విధంగా పిచికారీ చేశారు, ఉపయోగించిన మందుల వివరాలు, వాటి మోతాదు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఉపయోగించిన మందుల డబ్బాలు, బిల్లులను అధికారికి చూపించారు. రైతుల సమక్షంలోనే గ్రోమోర్ సిబ్బందిని మందుల వినియోగం, సూచించిన మోతాదుపై అధికారి వివరణ కోరారు. పంట నష్టానికి గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని అధికారి అనూష తెలిపారు. ఇదే మందులను పక్కనున్న ఇతర పొలాల్లో ఉపయోగించారా, అక్కడ పంట పరిస్థితి ఎలా ఉందో కూడా పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకున్న అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. తమ పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారి స్పందించి పొలాన్ని పరిశీలించడం పట్ల కౌలు రైతులు శ్రీను, కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. పంట నష్టాన్ని అంచనా వేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



ప్రజాజ్యోతి

20 Aug 2026 - Page 3

మందుల మాయలో మాడిన వరి పంట

- గ్రోమోర్ సూచించిన మందులు చల్లడంతో నష్టపోయిన కౌలు రైతులు శ్రీను, కోటేశ్వరరావు
- వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 19 (ప్రజా జ్యోతి):

## డ్రైనేజీలపై అక్రమ వ్యాపారాలు..

# రహదారులపై ప్రమాద ఘంటికలు!

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రోడ్లు..
- నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు
- రోడ్లపై ప్రజల ప్రాణాలు పోతున్న
- పట్టింపు లేని ఆర్ అండ్ బి, పంచాయితీ అధికారులు







**అశ్వాపురం, ఆగస్టు 20 ప్రజాజ్యోతి:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రహదారుల వెంట నిర్మించిన డ్రైనేజీలు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజీలపై దుకాణాలు, షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### »» డ్రైనేజీలపై దుకాణాలు.. నీటి ప్రవాహానికి ఆటంకం

రహదారుల వెంట ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు నిర్మించిన డ్రైనేజీలపై కొందరు వ్యాపారులు శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో కాలువలు పూర్తిగా మూసుకుపోయి మురుగునీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. వర్షాలు కురిసిన సమయంలో నీరు కాలువల్లోకి వెళ్లకుండా రహదారులపైకి చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమల బెడద కూడా పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

### »» కుంచించుకుపోతున్న రహదారులు

డ్రైనేజీలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో రహదారుల వెడల్పు తగ్గిపోతోంది. దుకాణాల ముందు వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. పాదచారులు ఫుట్‌పాత్ లేదా డ్రైనేజీ మార్గాన్ని ఉపయోగించుకునే అవకాశం లేక రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాల మధ్య ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు.

### »» పత్రికల్లో వార్తలు వచ్చినా మారని పరిస్థితి

డ్రైనేజీల ఆక్రమణలు, అక్రమ దుకాణాలపై పలు సందర్భాల్లో పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వార్తలు వచ్చిన సమయంలో అధికారులు హడావుడిగా స్పందించినప్పటికీ, కొద్ది రోజుల తర్వాత మళ్లీ పాత పరిస్థితి నెలకొంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### »» నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారా?

ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడం, ఆక్రమణలను తొలగించాలని హెచ్చరించడం వంటి చర్యలకే అధికారులు పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. నోటీసులు జారీ చేసిన అనంతరం వాటిపై తదుపరి చర్యలు లేకపోవడంతో ఆక్రమణలు మరింత పెరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. అధికారులు నోటీసులతో కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుని డ్రైనేజీలను ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని కోరుతున్నారు.

### »» ప్రమాదం జరిగిన తర్వాత మేల్కొంటారా?

డ్రైనేజీలపై దుకాణాలు, రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్ కారణంగా రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. రద్దీ సమయాల్లో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

### »» ఆక్రమణలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలి

మండల కేంద్రంతో పాటు ప్రధాన గ్రామాల్లోని రహదారులు, డ్రైనేజీలను పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. డ్రైనేజీలపై ఉన్న దుకాణాలు, షెడ్లు, ఇతర ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల వద్ద ఉన్న ఆక్రమణలపై ముందుగా దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

### »» శాశ్వత పరిష్కారం కోసం చర్యలు అవసరం

డ్రైనేజీలను ఆక్రమణల నుంచి కాపాడేందుకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఒకసారి ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ నిర్మాణాలు చేపట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అంటున్నారు. డ్రైనేజీలు మూసుకుపోకుండా వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు, మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రత, రహదారుల సౌకర్యం, పారిశుద్ధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటున్నారు. లేకపోతే భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బీఎల్ఏకు ఎమ్మెల్యే జారె పరామర్శ

**దమ్మపేట, ఆగస్టు 20(ప్రజాజ్యోతి):** మండలంలోని పార్కిలగండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ కొమరం అర్జున్‌రావు ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా అర్జున్‌రావు ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు సూచించారు.అనారోగ్యం నుంచి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పార్టీ తరఫున ఎల్లవేళలా అండగా ఉంటామని, ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని అర్జున్‌రావుకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కోర్స సాగర్, యూత్ కాంగ్రెస్ నాయకులు శివాజీ, నాగేంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ

- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 20,(ప్రజా జ్యోతి)** టెక్నాలజీ రంగం లో భారత దేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా దేశ విదేశాల్లో చాటిచెప్పిన మహానాయకుడు రాజీవ్ గాంధీ అని డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. భారత మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గురువారం కొత్వాల నాయకత్వం లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రాజీవ్ కూరగాయల మార్కెట్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ భారతదేశ సాంకేతికతకు ఆధునిక పునాదులు వేసి, దేశంలోనే అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన నేత రాజీవ్ గాంధీ అని అన్నారు. ఆయన కుమారుడు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే కాంగ్రెస్ కార్యకర్తల ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఐ. జలీల్,మహిపతి రాములింగం, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న గౌడ్, నూకల రంగారావు, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, సాదం రామకృష్ణ, వై. వెంకటేశ్వరరావు, దారా చిరంజీవి, కాపర్తి వెంకటాచారి, బాలినేని నాగేశ్వరరావు, ఎస్.వి.ఆర్.కె. ఆచార్యులు, కటుకూరి శేఖర్, గంధం నరసింహారావు, మస్నా శ్రీనివాస రావు, సామా వెంకటరెడ్డి, చౌగాని పాపారావు, బూసి శ్రీను, లక్ష్మణ్, ఓలపల్లి రాంబాబు, లింగ్యా, షేక్ బాషా,బ్యాంక్ చారి,డిష్ నాగేశ్వరరావు, బోగిని సందీప్, ఎలకా నాగేశ్వర రావు, మార్కెట్ కమిటీ నాయకులు శివ,సందు ప్రభాకర్,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు ఐదు బెంచ్ బల్లలు అందజేత

- ఎల్ఐసీ రిటైర్డ్ ఏబీఎం మధుబాబు ఆర్థిక సహకారం



**దమ్మపేట, ఆగస్టు 20(ప్రజాజ్యోతి):** మండలంలోని మందలపల్లి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు సత్తుపల్లి ఎల్ఐసీ బ్రాంచ్‌లో పనిచేస్తున్న చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ల ఆధ్వర్యంలో ఐదు బెంచ్ బల్లలను అందజేశారు. రిటైర్డ్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ శ్రీ మధుబాబు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాలకు బెంచ్ బల్లలను అందించడం అభినందనీయమని గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాసూరి వేణుగోపాలరావు, దొడ్డాకుల గోపాలరావు, గోలి శ్రీనివాస రెడ్డి, ఎం. పిచ్చయ్య, జె. సత్యనారాయణ, ఉపాధ్యాయిని బేతి సత్యవాణి, గ్రామ సర్పంచ్ గుజ్జుల శ్రీను, ఊడుగుల తిరుపతిరావు, బొంతు వెంకటముత్యం, నందికోల రామారావు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ లేక దుర్గతి!





**అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 20** అశ్వరావుపేట మండలం వినాయకపురంలో నీళ్లు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి వినాయకపురంలో మురుగునీటితో ప్రజల అవస్థలు అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం వినాయకపురం: ఏజెన్సీ ప్రాంతమైన వినాయకపురంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు, మురుగునీరు ఎటు వెళ్లాలో తెలియక రోడ్లపై, నివాస ప్రాంతాల వద్ద నిలిచిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం పడినా నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపై నిలిచిపోతుండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల ముందు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల బెడద పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

**డ్రైనేజీ ఎక్కడ?**

ప్రాంతం అభివృద్ధి చెందుతున్నా మురుగునీటి పారుదల వ్యవస్థపై అధికారులు దృష్టి సారించకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో డ్రైనేజీ కాలువలు నిర్మించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు.

రోడ్లపై నీరు.. ప్రజలకు నరకయాతన

నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు ఎక్కువ కాలం నిలిచిపోతే పారిశుధ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాక్స్ ఐటెమ్ | అధికారులకు 6 ప్రశ్నలు

1. వినాయకపురంలో పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థ ఎందుకు ఏర్పాటు చేయలేదు?
2. ప్రస్తుతం నిలిచిన నీటిని తొలగించేందుకు తక్షణ చర్యలు ఎప్పుడు?
3. వర్షపు నీరు వెళ్లేందుకు శాశ్వత కాలువల నిర్మాణానికి ప్రణాళిక ఉందా?
4. గతంలో డ్రైనేజీ కోసం నిధులు కేటాయించారా? కేటాయిస్తే ఎంత?
5. డ్రైనేజీ పనులు చేపట్టకుండా రోడ్లు నిర్మించడం వల్లే సమస్య తీవ్రమైందా?
6. ప్రజల ఫిర్యాదులపై అధికారులు ఎప్పుడు స్థల పరిశీలన చేస్తారు?

తాత్కాలిక చర్యలు కాదు.. శాశ్వత పరిష్కారం కావాలి

నీరు నిలిచిన ప్రతిసారి తాత్కాలికంగా మోటార్లతో నీటిని తోడటం కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రాంతంలోని డ్రైనేజీ వ్యవస్థపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి, అవసరమైన చోట కాలువలు నిర్మించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**పంచాయతీ సెక్రెటరీ వివరణ**

ప్రముఖ టిఆర్ఎస్ నేత బిర్రం వెంకటేశ్వరరావు ఇంటి ముందు నుండి శివాలయం వరకు భద్రాచలం అశ్వరావుపేట ప్రధాన రహదారి పై భవన నిర్మాణాలు జరుగుతూ ఉన్నాయి . నీరు ఎటు వెళ్లే పరిస్థితి లేక డ్రైనేజ్ వ్యవస్థ లేక మురుగునీరు అక్కడే నిలవ ఉండిపోతుంది దీనిపై ఎమ్మెల్యే మరియు ఇతర అధికారులు స్పందించి దీనికి శాశ్వత నిర్మాణం చేపడితే కానీ సమస్య తీరుతుందని సెక్రెటరీ వివరణ ఇచ్చారు

# దమ్మపేటలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు





(మొదటి పేజీ తరువాయి...)

ఓపీ, ఐపీ రిజిస్టర్లను తనిఖీ చేసి రోగులతో నేరుగా మాట్లాడారు.రక్త పరీక్షల విభాగాన్ని పరిశీలిస్తున్న సమయంలో అనాలసిస్ యంత్రం పనిచేయకపోవడాన్ని గుర్తించారు. ఈ పరికరం ఎంత కాలంగా వినియోగంలో లేదని సిబ్బందిని ప్రశ్నించగా సుమారు ఏడాది నుంచి పనిచేయడం లేదని వారు తెలిపారు. దీనిపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

### »» "మీ ఇంట్లో ఏదైనా పరికరం పనిచేయకపోతే ఇలాగే వదిలేస్తారా?"

సుమారు రూ.3 లక్షల విలువైన పరికరం ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్నా మరమ్మతులకు ఎందుకు చర్యలు తీసుకోలేదని, మీ ఇంట్లో ఏదైనా పరికరం పనిచేయకపోతే ఇలాగే వదిలేస్తారా. ప్రజలకు ఉపయోగపడాల్సిన వైద్య పరికరాలను నిరుపయోగంగా ఉంచడం సరికాదని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరికరాల పనితీరును సమగ్రంగా పరిశీలించి, పనిచేయని పరికరాలను తక్షణమే మరమ్మతులు చేయించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో పరికరాల నిర్వహణకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని సూచించారు.

### »» మోడల్ సోలార్ గ్రామంగా గండుగులపల్లి

గండుగులపల్లి గ్రామంలో కొనసాగుతున్న మోడల్ సోలార్ గ్రామం పనులను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లపై ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్యానెళ్లను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో మొత్తం 424మంది గృహజ్యోతి లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. స్లాబ్ ఉన్న 250 ఇళ్లలో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టగా, ఇప్పటికే 242 ఇళ్లలో యూనిట్ల ఏర్పాటు పూర్తయినట్లు తెలిపారు.ఒక్కో ఇంటికి 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.2 లక్షల వ్యయం అవుతున్నట్లు అధికారులు వివరించారు. ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ముందుగా గృహ అవసరాలకు వినియోగించుకుని, మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసే విధానం అమల్లో ఉందని తెలిపారు.లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్ సోలార్ యూనిట్ల వల్ల కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. మిగిలిన ఇళ్లలో పనులను వేగవంతం చేసి, గండుగులపల్లిని జిల్లాలో ఆదర్శంగా నిలిచే మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

### »» గురుకుల పాఠశాలలో పరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం

మదలపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూమ్, వంటగది, భోజనశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.డిజిటల్ క్లాస్‌రూమ్‌లో చెత్తాచెదారం, అపరిశుభ్ర వాతావరణం కనిపించడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన ప్రదేశంలో కనీస పరిశుభ్రత పాటించకపోవడంపై నిర్వాహకులను ప్రశ్నించారు. పాఠశాల పరిసరాలను వెంటనే శుభ్రం చేసి, తీసుకున్న చర్యల ఫొటోలను పంపించాలని ఆదేశించారు.

### »» మెనూ అమలులో నిర్లక్ష్యంపై చర్యలు

డైనింగ్ హాల్‌లో విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి భోజన నాణ్యత, మెనూ అమలు తీరును తెలుసుకున్నారు. ఆ రోజు మెనూ ఏమిటి, మెనూ ప్రకారం భోజనం అందుతోందా అని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం వంటగదిని పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, వంట విధానం, పరిశుభ్రతను తనిఖీ చేశారు.మెనూలో పేర్కొన్న కూర అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ వార్డెన్‌ను వివరణ కోరారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. డైనింగ్ హాల్‌లో డస్ట్ బిన్ ఉన్నప్పటికీ పరిశుభ్రత సరిగా లేకపోవడంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, మెనూ అమలులో నిర్లక్ష్యం వహించినందుకు ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు.

### »» విద్యుత్ సదుపాయాలపై దృష్టి

పాఠశాలలో విద్యుత్ సదుపాయాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అవసరమైన లైట్లు, ఇతర విద్యుత్ పరికరాలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యా సౌకర్యాలు, అవసరమైన మౌలిక వసతులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ తనిఖీల్లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, దమ్మపేట తహసీల్దార్ మద్దినేని మురళి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నవభారత్ రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటాం

- **డి.సి.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల**
- **కె.టి.పి.ఎస్. రిటైర్డ్ ఎ.డి.ఇ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టి-షర్టులు, శాలువాలు పంపిణీ**





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 20,(ప్రజాజ్యోతి)** నవభారత్ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పట్ల స్పందిస్తూ, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని డి.సి.ఎం .ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. నవభారత్ వెంచర్స్ లిమిటెడ్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన 30 మంది కార్మికులు నవభారత్ సెంటర్ వద్ద విశ్రాంతి హాల్ ఏర్పాటు చేసుకున్నారు. నవభారత్‌లో సుదీర్ఘకాలం కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఐఎన్‌టియుసి నేతగా రిటైర్డ్ అయిన వై.హనుమంత రావు, ఆయన కుమారుడు కెటిపిఎస్ రిటైర్డ్ ఎ.డి.ఇ. వై. వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో 20 వేల రూ॥లు విలువగల టి–షర్టు లను, శాలువా లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఎవ్వరికి, ఏ కష్టం వచ్చినా తాము అండగా నిలుస్తామన్నారు. విశ్రాంత కార్మికుల వసతి కోసం తమ వంతు కృషి చేస్తామని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబు, రిటైర్డ్ కార్మిక నాయకులు ఎస్.ఎ.జలీల్, దుబ్బా చెన్నమల్లు, వై. హనుమంత రావు, ఎం.వి. అప్పారావు, ఇ.ధన్ రాజ్, ప్రముఖ కాంట్రాక్టర్ చెరుకూరి శేఖర్, కాంగ్రెస్ నాయకులు కొండం వెంకన్న గౌడ్, వై. వెంకటేశ్వరరావు, కెటిపిఎస్ టెక్నికల్ డి.ఇ ఎస్.ఎన్.ఎస్. శేఖర్, విశ్రాంత కార్మికులు ఎన్. సమ్మయ్య, ఎన్. పాండురంగాచారి, ఎస్.డి. బాజీ, వి.వాసు, ఎన్.కృష్ణారావు, జి. సుబ్బయ్య, పి.వెంకటేశ్వరరావు, జి.గురవయ్య, ఎ.సంజీవరెడ్డి, ఇ.రాజయ్య, డి.వి.ఎస్. ఎన్. రెడ్డి, మన్మధ రావు, ఎమ్. ధర్మరాజు, ఎన్. కృష్ణతదితరులు పాల్గొన్నారు.

# సదరన్ కౌన్సిల్ సమావేశం వేదికగా తెలంగాణ ప్రయోజనాలపై లేఖల ద్వారా మంత్రి తుమ్మల విజ్ఞప్తి

- భద్రాచలం పరిసర 5 గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని కేంద్రమంత్రిని కోరిన మంత్రి తుమ్మల
- ఆయిల్ పామ్ గెలల ధర 25000 గా నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సహకరించాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుని కోరిన మంత్రి తుమ్మల
- పెద్దవాగు పునరుద్ధరణకు నిధులు విడుదల చేయాలని, భద్రాచలం – ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని చంద్రబాబును కోరిన మంత్రి తుమ్మల

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 20,(ప్రజా జ్యోతి)** కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన మహాబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ చర్చల్లో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న ఈ సమావేశంలో తెలంగాణ తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజనతో మిగిలిన అంశాల పరిష్కారం, అంతర్రాష్ట్ర సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది.

సమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పలు కీలక అంశాలపై లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయడం, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా నిధులు అందించడం, ఆయిల్‌పామ్ రైతులకు కనీస హామీ ధర కల్పించడం, భద్రాచలం–ఏలూరు అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటి అంశాలపై మంత్రి వారిని కల్పి విజ్ఞప్తి చేశారు.

### భద్రాచలం పరిసర ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భద్రాచలం పట్టణానికి భౌగోళికంగా, పరిపాలనాపరంగా అత్యంత సమీపంలో ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లోనే కొనసాగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తుమ్మల ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీల పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తిరిగి విలీనం చేయాలని కోరారు. ఈ గ్రామాల మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలుగా ఉండటంతో లేఖలో పేర్కొన్నారు.<ప్రస్తుతం ఈ గ్రామాలు తెలంగాణ భూభాగాల మధ్య, గోదావరి నది, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల మధ్య ఒక ప్రత్యేక భౌగోళిక పరిస్థితిలో ఉండటంతో ప్రజలకు పరిపాలనా సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం సుమారు 282 కిలోమీటర్ల దూరంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువుల రవాణాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల కారణంగా గిరిజన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులకు సమీపంలో, గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో పోలీసు, భద్రతా వ్యవస్థల మధ్య సమన్వయానికి కూడా ప్రస్తుత భౌగోళిక పరిస్థితి సమస్యగా మారుతోందని మంత్రి తెలిపారు. భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయం తెలంగాణలో ఉండగా, ఆలయానికి సంబంధించిన గణనీయమైన భూములు పురుషోత్తపట్నంలో ఉండటం వల్ల ఆలయ పరిపాలనలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను జోక్యం చేసుకొని, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ అనంతరం ఏర్పడిన భౌగోళిక అసమానతను సరిదిద్దేలా ఐదు గ్రామ పంచాయతీలను, వాటి పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తిరిగి చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. ఇదే అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కూడా మంత్రి విజ్ఞప్తి చేశారు.

### పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు ఏపీ వాటా నిధులు ఇవ్వాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు 2024 జూలై 18న కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో శాశ్వత పునరుద్ధరణ పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా నిధులను వెంటనే అందించాలని మంత్రి తుమ్మల కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 16,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుండగా, అందులో 13,640 ఎకరాలు ఆయకట్టు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని, ప్రాజెక్టు దెబ్బతిన్న వెంటనే తెలంగాణ ప్రభుత్వం రింగ్‌బండ్ నిర్మాణం సహా తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టి రెండు రాష్ట్రాల ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకుందని తెలిపారు. అయితే శాశ్వత పునరుద్ధరణకు రూ.92.20 కోట్లు అంచనా వేయడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్‌లోనే 85.25 శాతం ఆయకట్టు ఉన్నందున, శాశ్వత పునరుద్ధరణ వ్యయాన్ని నిష్పత్తి ప్రాతిపదికన పంచుకొని అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. ఈ అంశంపై గత ఫిబ్రవరిలోనే విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్ణయం పెండింగ్‌లో ఉందని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆయిల్‌పామ్ రైతులకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర

ఆయిల్‌పామ్ సాగు రైతుల ఆదాయ భద్రత కోసం ఆయిల్ పామ్ గెలల (ఎఫ్ ఎఫ్ బి) ఎస్ ,టన్నుకు కనీస హామీ ధర రూ.25,000గా నిర్ణయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయిల్‌పామ్ సాగులో ప్రారంభ పెట్టుబడి అధికంగా ఉండటంతో పాటు పంటకు ఆదాయం రావడానికి ఎక్కువ కాలం పడుతుందని, అంతర్జాతీయ క్రూడ్ పామ్ ఆయిల్, ఎడిబుల్ ఆయిల్ ధరల్లో హెచ్చుతగ్గులు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రముఖ ఆయిల్‌పామ్ సాగు రాష్ట్రంగా ఉండగా, తెలంగాణలోనూ జాతీయ ఎడిబుల్ ఆయిల్స్ మిషన్–ఆయిల్‌పామ్ కింద సాగు విస్తీర్ణం వేగంగా పెరుగుతోందని పేర్కొన్నారు. రూ.25 వేల కనీస హామీ ధరతో పాటు సాగు వ్యయానికి అనుసంధానమైన కాలానుగుణ సవరణ విధానం అమలైతే రైతులకు స్థిరమైన, గిట్టుబాటు ఆదాయం లభించడంతో పాటు అంతర్జాతీయ ధరల ఒడిదుడుకుల నుంచి రక్షణ లభిస్తుందని, దేశంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు రైతుల్లో విశ్వాసం పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర ఆయిల్‌పామ్ సాగు రాష్ట్రాల సమన్వయంతో కేంద్రంపై ఒత్తిడి తేవాలని చంద్రబాబును కోరారు.

### భద్రాచలం–ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలి

తెలంగాణలోని భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు వరకు చింతలపూడి, దమ్మపేట మీదుగా వెళ్లే రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి, మంజూరు చేసేలా కేంద్ర రహదారులు–రవాణా శాఖపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఒత్తిడి తేవాలని మంత్రి తుమ్మల ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. సుమారు 160–165 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ అంతర్రాష్ట్ర రహదారి మార్గం ప్రధానంగా మారుమూల, గిరిజన ప్రాంతాల గుండా సాగుతుందని, మార్కెట్లు, వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలకు మెరుగైన ప్రాప్యత కల్పిస్తుందని తెలిపారు. ఈ రహదారిలో గణనీయమైన భాగం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో ఆ రాష్ట్రానికి కూడా ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. భద్రాచలం వద్ద ఎన్ హెచ్-30ను, ఏలూరు వద్ద ఎన్.హెచ్ 16ను అనుసంధానించే కీలక మార్గంగా ఈ రహదారి ఉపయోగపడుతుందని, అశ్వారావుపేట–జీలుగుమిల్లి ప్రాంతంలోని జాతీయ రహదారి నెట్‌వర్క్‌తో అనుసంధానం ద్వారా రెండు రాష్ట్రాల మధ్య రవాణా, ప్రాంతీయ కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ రహదారి హోదా, మంజూరుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

## బిజెపి జిల్లా మహిళా మోర్చా కమిటీ నియామకం

- జిల్లా అధ్యక్షురాలుగా సముద్రాల గాయత్రి
- 26 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీ ఎంపిక
- బిజెపి అనుబంధ మహిళా కమిటీని ప్రకటించిన జిల్లా అధ్యక్షులు" బైరెడ్డి"





**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 20,(ప్రజా జ్యోతి)** భారతీయ జనతా పార్టీ అనుబంధ జిల్లా మహిళా మోర్చా నూతన కమిటీని పార్టీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి గురువారం ప్రకటించారు. కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో జరిగిన మహిళా మోర్చా కమిటీకి పూర్తిస్థాయి 26 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించడం జరిగింది. జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలుగా సముద్రాల గాయత్రిని నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షులు అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి ఆధ్వర్యంలో 26 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని ప్రకటించడం ప్రకటించారు, ఈ కమిటీలో ఉపాధ్యక్షులుగా కేతిని సావిత్రి, బానోత్ గంగ, అట్రం మమత, గరిక లక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా జల్ల స్వప్న, ముప్ప అపర్ణలను నియమించారు. అదేవిధంగా కార్యదర్శులుగా ధారావత్ పార్వతి, అడప వెంకట మణి, బట్టు సంధ్య, ఉయిక తులసిలను నియమించారు. కోశాధికారిగా భీమల్ సునీత, ఆఫీస్ సెక్రటరీలుగా ఘుఖ్య ఆశ, కొల్లె అనిత, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పల్లపు శిరీష, మంకీ బాత్ కన్వీనర్‌గా బండారి రాజేశ్వరి, ఐటీ కన్వీనర్‌గా పోలే మనస్విని, స్పోక్స్ పర్సన్‌గా భోగ లక్ష్మిలను ఎంపిక చేశారు. అలాగే తాండ్ర కుసుమ భవాని, ఏసు మని, ధారావత్ భారతి, ధారావత్ విష్ణు ప్రియ, పుట్ట వెంకటరమణ, పర్వగాని నాగమణి, పర్వగాని శ్రావణి, రావుల పద్మ, పుట్టి సుజాతలను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి మాట్లాడుతూ మహిళా మోర్చా నూతన కమిటీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తిని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలకు ప్రత్యేకించి 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, వివక్షతకు వ్యతిరేకంగా బిజెపి మహిళ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి పార్టీలో మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించడం హర్షణీయమన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

## ప్రమాదకరంగా బైక్ నడిపిన యువకుడిపై కేసు నమోదు

**దమ్మపేట, ఆగస్టు 20(ప్రజాజ్యోతి):** మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన 22 సంవత్సరాల వయస్సు ఉన్న యువకుడు పల్సర్ 220 బైక్‌ను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ విద్యార్థులకు ప్రమాదం జరిగే విధంగా వ్యవహరించిన ఘటనపై కేసు నమోదైంది. దమ్మపేట మండల కేంద్రంలోని బోటనీ బాలాజీ పాఠశాల ఎదుట విద్యార్థుల రాకపోకలు సాగుతున్న సమయంలో యువకుడు బైక్‌ను ప్రమాదకరంగా నడిపినట్లు పోలీసులు తెలిపారు. పాఠశాలల సమీపంలో వాహనాలను అతివేగంగా నడపడం ద్వారా విద్యార్థుల భద్రతకు ముప్పు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

. . పర్స వెంకట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 20 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్స వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో సాంకేతికత, కంప్యూటర్ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు సంస్కరణలకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ ఆధునీకరణకు రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

